'ప్రిడేటర్' డీల్‌పై ముందుకే!

వచ్చే మార్చిలోగా డ్రోన్ల కొనుగోలు ఒప్పందం ఖరారు

150 కోట్లు విలువ చేయని ఒక్కో డ్రోన్‌కు 813 కోట్లు

అధిక చెల్లింపుపై ఆరోపణలున్నా వెనక్కి తగ్గని కేంద్రం

స్వదేశీ రక్షణ సంస్థలను కాదని విదేశీ సంస్థకు కాంట్రాక్ట్

న్యూఢిల్లీ, నవంబర్ 27: అమెరికా నుంచి అధిక ధరకు ప్రిడేటర్ డ్రోన్ల కొనుగోలుపై తీవ్ర విమర్శలు వస్తున్నా కేంద్రంలోని మోదీ సర్కారు వెనక్కు తగ్గడం లేదు. అమెరికా రక్షణ రంగ ఉత్పత్తుల సంస్థ జనరల్ అటామిక్స్ (జీఏ) నుంచి ఎంక్యూ-9బీ రకానికి చెందిన 31 ప్రిడేటర్ డ్రోన్లను కొనుగోలు చేసేందుకు కేంద్రం సిద్ధమైంది. ఇందుకు సంబంధించి వచ్చే ఏడాది మార్చిలోగా ఒప్పందాన్ని ఖరారు చేసుకొనే యోచనలో భారత్, అమెరికాలు ఉన్నట్టు సంబంధిత వర్గాలు తాజాగా వెల్లడించాయి. డ్రోన్ల సరఫరాకు కొద్ది వారాల్లో యూఎస్ కాంగ్రెస్ ఆమోదం తెలుపుతుందని, తర్వాత మార్చి నాటికి రెండు ప్రభుత్వాల మధ్య ఒప్పందం ఖరారు అవుతుందని తెలిపాయి. డ్రోన్ల కొనుగోలుకు సంబంధించి భారత ప్రభుత్వ లెటర్ ఆఫ్ రిక్వెస్ట్(ఎల్‌వోఆర్)పై అమెరికా స్పందించిన తర్వాత భారత్, అమెరికా ప్రభుత్వాలు తుది దశ చర్చలు జరుపుతాయని పేర్కొన్నాయి. ఈ చర్చల్లో కొనుగోలు ధరను ఖరారు చేస్తారని చెబుతున్నప్పటికీ, ఈ డ్రోన్ల డీల్ దాదాపు రూ.25 వేల కోట్లు(3 బిలియన్ డాలర్లు) ఉండే అవకాశం ఉన్నది. ఈ నెల మొదట్లో ఢిల్లీలో జరిగిన భారత, అమెరికా రక్షణ శాఖ మంత్రులు రాజ్‌నాథ్, లాయిడ్ ఆస్టిన్‌ల సమావేశంలో ప్రతిపాదిత ప్రిడేటర్ డ్రోన్ల కొనుగోలుపై చర్చ జరిగినట్టు సమాచారం.

డ్రోన్ల కొనుగోలులో గోల్‌మాల్!

అమెరికా పర్యటనలో భాగంగా ప్రధాని మోదీ స్వయంగా గత జూన్‌లో డ్రోన్ల కొనుగోలు ఒప్పంద చర్చల్లో భాగమయ్యారు. దాదాపు 3 బిలియన్ డాలర్లు(రూ.25 వేల కోట్లు) జీఏకు భారత్ చెల్లించనున్నట్టు ప్రాథమిక ఎంవోయూలో ఇరువర్గాలు వెల్లడించాయి. అంతర్జాతీయ విపణిలో ఇదే మాడల్ ప్రిడేటర్ ఒక్కో డ్రోన్ ఖరీదు రూ.150 కోట్లు మాత్రమే. అయితే ఒక్కో డ్రోన్‌కు రూ.813 కోట్లు చెల్లించేందుకు భారత్ సిద్ధమవ్వడంపై ప్రతిపక్షాలు, ఇతర వర్గాల నుంచి తీవ్ర విమర్శలు వచ్చాయి. దీంతో ఇంకా డీల్ ఫైనల్ కాలేదని కేంద్రం చెప్పుకొచ్చింది. జీ20 సమావేశాల కోసం భారత్‌కు వచ్చిన అమెరికా అధ్యక్షుడు బైడెన్‌తో ప్రధాని మోదీ జరిపిన సమావేశంలోనూ ఈ డీల్‌పై చర్చ జరిగిందని, రూ.25 వేల కోట్ల మేరకే ప్రిడేటర్ డ్రోన్ డీల్‌ను ఖరారు చేసినట్టు విశ్వసనీయవర్గాలు తెలిపాయి. దీంతో డ్రోన్ల కొనుగోలులో గోల్‌మాల్ జరుగుతున్నదన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

ప్రస్తుతానికి అన్ని అవసరం లేదన్నా..

ప్రిడేటర్ డ్రోన్ల కొనుగోలుపై ఆర్మీ విభాగం అసంతృప్తితోనే ఉన్నట్టు తెలుస్తున్నది. 31 డ్రోన్లు ప్రస్తుతం తమకు అవసరం లేదని, 18 డ్రోన్లను కొనుగోలు చేయాలని గత ఏప్రిల్‌లో కేంద్రానికి విజ్ఞప్తి చేసింది. డ్రోన్ల కొనుగోలుపై పునరాలోచించాలని కూడా ఓసారి సూచించింది. అయినప్పటికీ, ఇవన్నీ పట్టించుకోని కేంద్రం.. డీల్‌పై ఏకపక్షంగానే ముందుకు వెళ్తున్నది. 31 డ్రోన్ల సరఫరా, మరమ్మతులు, ఇతర త్రా సహాయక చర్యలను నిర్ణీత వ్యవధి వరకు అందిస్తామని జీఏ ఎంవోయూలో పేర్కొన్నది. అయితే, డ్రోన్లకు సంబంధించిన సాంకేతిక సమాచారాన్ని ఇచ్చేది లేదని తెగేసి చెప్పింది. ఇది భారత భద్రతకు ముప్పేనని రక్షణరంగ నిపుణులు చెబుతున్నారు.

ఒక్కో దేశానికి ఒక్కో ధర

కాగా, ఒక్కో దేశానికి ఒక్కో రేటుకు డ్రోన్‌లను సరఫరా చేసే ట్రాక్ రికార్డు జీఏకు ఉన్నట్టు తెలుస్తుండటం ఆందోళన కలిగిస్తున్నది. ఈ తరహా డ్రోన్లను మార్కెట్ రేటుకే తయారుచేసే సామర్థ్యం హాల్, డీఆర్డీవో వంటి స్వదేశీ రక్షణ సంస్థలకు కూడా ఉన్నదని నిపుణులు చెబుతున్నారు. అయితే, దేశీయ సంస్థలను ప్రోత్సహించకుండా కేంద్రం ఆయా కాంట్రాక్ట్‌లను విదేశీ కంపెనీలకు కట్టబెట్టడంపై మండిపడుతున్నారు.

డ్రోన్లను జీఏ ఏ దేశానికి ఎంతకు అమ్ముతున్నదంటే?

యూకే	రూ.102 కోట్లు
జర్మనీ	రూ.139 కోట్లు
అమెరికా	రూ.450 కోట్లు
భారత్	రూ.813 కోట్లు

కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా సోమవారం పంజాబ్‌లో ఆందోళన చేస్తున్న రైతులు

నేడు రాజ్‌భవన్లకు మార్చ్

కేంద్రానికి వ్యతిరేకంగా రెండో రోజూ కొనసాగిన రైతుల మహాధర్నా

న్యూఢిల్లీ: రైతు, కార్మిక సంఘాల ఐక్య వేదిక పిలుపు మేరకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా చేపట్టిన దేశవ్యాప్త ఆందోళనలు సోమవారం రెండో రోజూ కొనసాగాయి. అసెంబ్లీ ఎన్నికల ఐదు రాష్ట్రాలు మినహా దాదాపు ఇతర అన్ని రాష్ట్రాల రాజధానుల్లో రైతులు, కార్మికులు నిరసనలు చేపట్టారు. మోదీ సర్కార్ అనుసరిస్తున్న రైతు, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలు, కార్పొరేట్లకు కొమ్ముకాస్తూ తీసుకొంటున్న నిర్ణయాలకు వ్యతిరేకంగా పెద్దయెత్తున నినాదాలు చేశారు. బీజేపీ ప్రభుత్వ హయాంలో రైతులు, కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని, మోసానికి గురవుతున్నారని నేతలు తమ ప్రసంగాల్లో విమర్శించారు. పంటలకు కనీస మద్దతు ధర, లేబర్ కోడ్‌ల రద్దు, పీఎస్‌యూ ప్రైవేటీకరణను ఆపాలనే తదితర డిమాండ్లపై సంయుక్త కిసాన్ మోర్చా(ఎస్కేఎం), కేంద్ర కార్మిక సంఘాలు మూడు రోజుల పాటు దేశవ్యాప్త 'మహాపడావ్'కు పిలుపునిచ్చాయి. ఆందోళనకారులు మంగళవారం అన్ని రాష్ట్రాల్లోని రాజ్‌భవన్లకు మార్చ్ చేపట్టనున్నారు. తమ డిమాండ్లతో కూడిన చార్టర్‌ను గవర్నర్లకు అందించనున్నామని రైతు, కార్మిక నేతలు తెలిపారు. వ్యవసాయం సంక్షోభంలో చిక్కుకొన్నదని, ఇందుకు నయా ఉదారవాద విధానాలే కారణమని ఎస్కేఎం ఓ ప్రకటనలో విమర్శించింది. కేవలం రైతులపై మాత్రమే కాకుండా కార్మికులు, యువతపై ఈ సంక్షోభ ప్రభావం పడుతున్నదని, గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణాలకు వలసలు పెరిగాయని ఆందోళన వ్యక్తం చేసింది. బీజేపీ సర్కార్ కార్పొరేట్ దోపిడీకి యథేచ్ఛగా అవకాశాలు కల్పిస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేసింది.

సీట్ల పరిమితి ఎత్తివేత!

- ప్రైవేట్ ఇంజినీరింగ్ కాలేజీల్లో వెసులుబాటుకు కసరత్తు
- ఏఐసీటీఈ ప్రతిపాదనలు

న్యూఢిల్లీ, నవంబర్ 27: ప్రైవేట్ ఇంజినీరింగ్ కాలేజీల్లో సీట్ల పరిమితి ఎత్తివేసే దిశగా కేంద్రం కసరత్తు చేస్తున్నది. ప్రైవేట్ కాలేజీల్లోని మౌలిక వసతులు, టీచింగ్ ఫ్యాకల్టీని దృష్టిలో పెట్టుకొని సీట్ల సంఖ్యను పెంచుకునే విధంగా 'ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్' (ఏఐసీటీఈ) సరికొత్త నిబంధనావళిని తీసుకురాబోతున్నది. 'ప్రైవేట్ కాలేజీలు ఆఫర్ చేస్తున్న వివిధ కోర్సులకు సంబంధించి సీట్ల పరిమితిలో మినహాయింపులు ఇవ్వదలుచుకున్నాం. ఈ ప్రతిపాదనలు ప్రస్తుతం పరిశీలనలో ఉన్నాయి' అని ఏఐసీటీఈ సభ్యుడు రాజీవ్ కుమార్ తాజాగా వెల్లడించారు. 'వివిధ కోర్సులు, ప్రోగామ్స్ ఆఫర్ చేస్తున్న కాలేజీల్లో సీట్ల పరిమితి ఎత్తేయాలని కౌన్సిల్ ప్రతిపాదించింది. 2024-25 విద్యా సంవత్సరం నుంచి అమల్లోకి తీసుకురావాలని భావిస్తున్నాం' అని ముసాయిదా ప్రతిలో ఏఐసీటీఈ పేర్కొన్నది.

కాలేజీల నుంచి మిశ్రమ స్పందన

ఈ నిర్ణయంపై టాప్ ఇంజినీరింగ్ కాలేజీలు హర్షం వ్యక్తం చేస్తుండగా, తమ కాలేజీల్లో అడ్మిషన్లు పడిపోతాయని మిడ్ లెవల్ కాలేజీలు ఆందోళన చెందుతున్నాయి. 'ఈ నిర్ణయం టాప్ ఇంజినీరింగ్ కాలేజీలు, మిడ్ లెవల్ కాలేజీల మధ్య అసమానతల్ని పెంచుతుంది. అడ్మిషన్లు పడిపోతే నాణ్యమైన విద్యను మిడ్ లెవల్ కాలేజీలు అందించలేని పరిస్థితి ఏర్పడుతుంది' అని ఓ కాలేజీ డైరెక్టర్ అన్నారు.

ఐరిష్ రచయితకు బుకర్ ప్రైజ్

లండన్: ప్రతిష్ఠాత్మక బుకర్ ప్రైజ్-2023ను ఐరిష్ రచయిత పాల్ లించ్ గెలుచుకున్నారు. ఆయన రాసిన 'ప్రాఫెట్ సాంగ్' పుస్తకానికి ఈ అవార్డు లభించింది. దీంతో ఐరిష్ నుంచి ఈ అవార్డు అందుకున్న ఐదో వ్యక్తిగా పాల్ లించ్ నిలిచారు. పశ్చిమ దేశాల్లో అనిశ్చితిని గుర్తు చేయడమే కాకుండా సిరియాలో కొనసాగుతున్న అంతర్యుద్ధాన్ని పుస్తకంలో రచయిత ప్రస్తావించారు. ముఖ్యంగా భయంకర ప్రపంచంతో పోరాడుతున్న ఓ కుటుంబ గాథను వివరించారు. ప్రజాస్వామ్య విలువలు ఏ విధంగా పతనమయ్యాయో గుర్తు చేశారు.

అమెరికా వెళ్లే విద్యార్థులకు కొత్త రూల్స్

న్యూఢిల్లీ, నవంబర్ 27: ఉన్నత విద్య కోసం అమెరికా వెళ్లేందుకు సిద్ధమవుతున్న భారతీయ విద్యార్థులకు ఆ దేశం కొత్త నిబంధనలు విధించింది. వీసా దరఖాస్తు చేసుకొనేటప్పుడు పాటించాల్సిన నిబంధనల్లో కొన్ని మార్పులు చేసినట్టు సోమవారం ఎక్స్‌లో తెలిపింది. ఈ నిబంధనలు సోమవారం నుంచే అమల్లోకి వచ్చినట్టు పేర్కొన్నది. ఎఫ్, ఎం, జే వీసాలకు దరఖాస్తు చేసుకొనే అభ్యర్థులు తమ సొంత పాస్‌పోర్టు నంబర్‌తో ప్రొఫైల్ తయారుచేసి పంపాలని సూచించింది. తప్పుడు పాస్‌పోర్ట్ నంబర్ సమర్పిస్తే దరఖాస్తు తిరస్కరించటంతోపాటు డిపాజిట్ చేసిన డబ్బును కూడా తిరిగి ఇవ్వబోమని స్పష్టంచేసింది. ఎఫ్, ఎం వీసా కోసం దరఖాస్తు చేసేవాళ్లు ఎక్స్‌చేంజ్ విజిటర్ ప్రోగ్రామ్, స్టూడెంట్ సర్టిఫైడ్ ప్రోగ్రాంలో తప్పనిసరిగా ఎన్‌రోల్ చేసుకోవాలి. జే వీసాకు దరఖాస్తు చేసేవాళ్లు అమెరికా విదేశాంగశాఖ గుర్తింపు పొందిన సంస్థ నుంచి స్పాన్సర్‌షిప్ పొంది ఉండాలి. వీసా అపాయింట్‌మెంట్ కోసం ఇప్పటికే ప్రొఫైల్ సిద్ధం చేసుకొన్నవారు తమ పాస్‌పోర్ట్ అసలైన నంబర్‌తో ఆ దరఖాస్తులను అప్‌డేట్ చేసుకోవాలని సూచించింది.

సొరంగంలో మాన్యువల్‌గా డ్రిల్లింగ్

ఉత్తర్‌కాశీ, నవంబర్ 27: అమెరికన్ అగర్ యంత్రం మరోసారి విరిగి పోవడంతో ఉత్తరాఖండ్‌లో కూలిపోయిన సొరంగంలో సోమవారం రాత్రి 7 గంటలకు మాన్యువల్‌గా డ్రిల్లింగ్ ప్రారంభించారు. ఇరుకైన ప్రదేశాల్లో బొగ్గును తవ్వేందుకు ఉపయోగించే పద్ధతిలో ర్యాట్ మైనర్స్ కార్మికులు ఈ తవ్వకాన్ని ప్రారంభించారు. 800 ఎమ్ఎమ్ డయామీటర్ల పైపుల గూండా ఈ కార్మికులు లోపలికి వెళ్లి శిథిలాలను పారల ద్వారా తొలగిస్తారు. మరోవైపు సొరంగంపై నిలువుగా చేస్తున్న డ్రిల్లింగ్ 36 మీటర్లు పూర్తయిందని అధికారులు తెలిపారు. బర్కోట్ వైపు నుంచి అడ్డంగా తవ్వడం కొనసాగుతున్నది. కార్మికులను చేరుకోవడానికి మరో 12 మీటర్ల తవ్వకం అవసరం.

గుజరాత్‌లో దళిత మహిళ హత్య

భావ్‌నగర్: ప్రధాని మోదీ సొంత రాష్ట్రం, బీజేపీ పాలిత గుజరాత్‌లో దళితులకు రక్షణ లేకుండా పోతున్నది. ఎస్సీ, ఎస్టీ వేధింపుల చట్టం కింద నమోదైన కేసును వెనక్కి తీసుకోలేదనే కోపంతో గీతాబెన్ మరు(45) అనే దళిత మహిళను దుండగులు కొట్టి చంపారు. భావ్‌నగర్‌లో ఆదివారం ఈ దారుణం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. తమ కుమారుడు పెట్టిన కేసును వెనక్కి తీసుకోవాలని గీతాబెన్‌పై నిందితులు శైలేల్ కొలి, రొహల్ కొలి ఒత్తిడి తీసుకొచ్చారు. అందుకు ఆమె నిరాకరించారు. దీంతో వారు మరో ఇద్దరితో కలిసి స్టీల్ పైపులతో ఆమెపై విచక్షణా రహితంగా దాడి చేశారు. ఇండ్లు వదిలి కుటుంబంతో సహా ఎక్కడికైనా వెళ్లిపోవాలని బెదిరించారు. బాధితురాలు చికిత్స పొందుతూ సోమవారం ఉదయం మరణించింది. నిందితుల కోసం పోలీసులు గాలిస్తున్నారు.

సొంత సర్కారుపై ఉమాభారతి ఫైర్

బోఫాల్, నవంబర్ 27: మధ్యప్రదేశ్‌లోని సొంత పార్టీ ప్రభుత్వంపై బీజేపీ నాయకురాలు, మాజీ సీఎం ఉమాభారతి ఆగ్రహం వ్యక్తం చేశారు. శాదోల్ పట్వారీ ప్రసన్న సింగ్‌ను ఇసుక మాఫియా ట్రాక్టర్‌తో తొక్కి చంపడం సిగ్గుచేటు, అగౌరవమని ఆమె వ్యాఖ్యానించారు. 'ఒక ప్రభుత్వ ఉద్యోగిని ఇసుక మాఫియా చంపడం మొత్తం మధ్యప్రదేశ్ ప్రభుత్వ వ్యవస్థకు, సమాజానికి, పరిపాలనకు సిగ్గుచేటు, అగౌరవం. నేరగాళ్లపై కఠిన చర్యలు తీసుకోవాలి' అని ఆమె సోమవారం ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

బీజేడీలోకి మాజీ ఐఏఎస్ పాండియన్

భువనేశ్వర్: ఒడిశా రాజకీయాల్లో కీలక పరిణామం చోటుచేసుకొన్నది. రాష్ట్ర సీఎం నవీన్ పట్నాయక్‌కు అత్యంత సన్నిహితుడు, మాజీ ఐఏఎస్ అధికారి కార్తికేయన్ పాండియన్ సోమవారం అధికార బిజూ జనతాదళ్‌లో అధికారికంగా చేరారు. ఇప్పటి వరకు తెర వెనుక ఉండి రాజకీయాలు నడిపిస్తున్నారని ఆరోపణలు ఎదుర్కొంటున్న కార్తికేయన్ పాండియన్.. ఇప్పుడు అధికారికంగా తెరపైకి రావడం గమనార్హం. పార్టీలో నంబర్ 2 స్థానం ఆయనదే అని విశ్లేషకులు చెబుతున్నారు.

- 'నమస్తే' దసరా బంపర్ ప్రైజ్ కారు అందజేత

నమస్తే తెలంగాణ, తెలంగాణ టుడే సంయుక్తంగా నిర్వహించిన దసరా షాపింగ్ బొనాంజా బంపర్ ప్రైజ్ నిస్సాన్ మాగ్నైట్ కారును సోమవారం విజేత వీఎస్ఎన్ మూర్తి దంపతులు అందుకున్నారు. హైదరాబాద్‌లోని బంజారాహిల్స్‌లోని ప్రధాన కార్యాలయంలో నమస్తే తెలంగాణ ఎడిటర్ తిగుళ్ల కృష్ణమూర్తి, తెలంగాణ టుడే ఎడిటర్ కే శ్రీనివాస్‌రెడ్డి, తెలంగాణ పబ్లికేషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ వైస్ ప్రెసిడెంట్ డీ చిరంజీవి, జనరల్ మేనేజర్ (ఏడీబీటీ) ఎన్ సురేందర్‌రావు కారు తాళాలను విజేత దంపతులకు అందజేశారు.

- హైదరాబాద్, నవంబర్ 27 (నమస్తే తెలంగాణ)

ఓటర్ల ప్రశాంతతకు భంగం కలిగించొద్దు

- గడువు ముగిశాక ప్రచారం చేయొద్దు
- బల్క్ ఎస్ఎంఎస్‌లు పంపొద్దు
- సీఈవో వికాస్‌రాజ్

హైదరాబాద్, నవంబర్ 27 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో ఎన్నికల ప్రచారం ముగిశాక ఓటర్ల మానసిక ప్రశాంతతకు ఎలాంటి భంగం కలిగించరాదని, సినిమా హాళ్లతోపాటు టీవీలు, ఇతర ప్రచార సాధనాల ద్వారా ఎన్నికలకు సంబంధించిన అంశాలను ప్రదర్శించకూడదని సీఈవో వికాస్‌రాజ్ అన్ని రాజకీయ పార్టీలకు, అభ్యర్థులకు స్పష్టం చేశారు. ఈ నిబంధనను ఉల్లంఘిస్తే చట్టప్రకారం చర్యలు చేపడతామని హెచ్చరించారు. ఎన్నికల ఫలితాలను ప్రభావితం చేసేందుకు, దెబ్బతీసేందుకు ఉద్దేశించిన ఏ చర్య అయినా దీని పరిధిలోకి వస్తుందని సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రచార పర్వం ముగిసినప్పటి నుంచి పోలింగ్ పూర్తయ్యే వరకు ఎలక్ట్రానిక్ మీడియాలో ఎలాంటి రాజకీయ ప్రకటనలు ప్రసారం చేయకూడదని, ఓపీనియన్ పోల్స్, చర్చా కార్యక్రమాలు, విశ్లేషణలు, విజువల్స్, సౌండ్ బైట్స్ విషయంలో నిబంధనలు పాటించాలని తెలిపారు. ఈ నెల 29, 30 తేదీల్లో రాజకీయ నాయకులు ఎన్నికలకు సంబంధించిన ఇంటర్వ్యూలు ఇవ్వరాదని, పత్రికా గోష్ఠులు నిర్వహించరాదని, బల్క్ ఎస్ఎంఎస్‌లు పంపకూడదని స్పష్టం చేశారు. మంచి ప్రభుత్వాన్ని ఎన్నుకునేందుకు విజ్ఞతతో నిర్భయంగా ఓటు వేయాల్సిన ఆవశ్యకతను ఓటర్లకు వివరించాలని మీడియాకు విజ్ఞప్తి చేశారు.

నేటితో ప్రచారానికి తెర

గజ్వేల్‌లో ముగించనున్న సీఎం కేసీఆర్

హైదరాబాద్, నవంబర్ 27 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర శాసనసభ ఎన్నికల ప్రచార ఘట్టానికి మంగళవారంతో తెరపడనున్నది. పోలింగ్‌కు 48 గంటల ముందే ప్రచారాన్ని ముగించాలని ఎన్నికల నిబంధనలు స్పష్టం చేస్తున్నాయి. దీంతో రాష్ట్రంలోని 106 నియోజకవర్గాల్లో మంగళవారం సాయంత్రం 5 గంటలకు ప్రచారం ముగియనున్నది. మిగిలిన 13 నియోజకవర్గాల్లో ప్రత్యేక పరిస్థితుల దృష్ట్యా సాయంత్రం 4 గంటలకే ప్రచారం ముగుస్తుంది. ప్రచార గడువు ముగియగానే నియోజకవర్గాల నుంచి స్థానికేతర నాయకులు వెళ్లిపోవాలని ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. గురువారం జరుగనున్న ఈ ఎన్నికల్లో విజయం కోసం అన్ని పార్టీలు ముమ్మరంగా ప్రచారం నిర్వహిస్తున్నాయి. బీఆర్ఎస్ విజయం కోసం పార్టీ అధ్యక్షుడు, సీఎం కేసీఆర్‌తో పాటు వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్, మంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ప్రచారాన్ని హోరెత్తించారు. సీఎం కేసీఆర్ మంగళవారం గజ్వేల్‌లో ఎన్నికల ప్రచారాన్ని ముగించనున్నారు. గత ఎన్నికల సమయంలో చివరి సభను గజ్వేల్‌లో పెట్టిన సీఎం కేసీఆర్.. ఈసారి కూడా అదే అనవాయితీని కొనసాగించనున్నారు.

నేడు ఏఆర్వోల సమావేశం

పోలింగ్‌ను ప్రశాంతంగా నిర్వహించేందుకు ఎన్నికల సంఘం చురుగ్గా ఏర్పాట్లు చేస్తున్నది. ఇప్పటికే అన్ని ఏర్పాట్లు చివరి దశకు చేరుకున్నాయి. పోలింగ్ సిబ్బందికి శిక్షణ, వారికి నియోజకవర్గాల కేటాయింపు పూర్తయింది. ఈవీఎంలను నియోజకవర్గాలకు చేర్చిన ఎన్నికల సంఘం.. పోస్టల్ బ్యాలెట్ల తరలింపు కోసం అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులతో మంగళవారం గచ్చిబౌలి స్టేడియంలో సమావేశాన్ని నిర్వహించనున్నది. సీఈవో వికాస్‌రాజ్, జాయింట్ సీఈవో సర్ఫరాజ్ అహ్మద్ తదితరులు ఈ సమావేశంలో పాల్గొననున్నారు.

దివ్యాంగులకు ఉచిత రవాణా సదుపాయం

హైదరాబాద్, నవంబర్ 27 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర శాసనసభ ఎన్నికల్లో దివ్యాంగులు ఓటు హక్కు వినియోగించుకునేలా ప్రోత్సహించేందుకు ఎన్నికల సంఘం ప్రత్యేక చర్యలు చేపట్టింది. రాష్ట్రంలో 5.06 లక్షల మంది దివ్యాంగ ఓటర్లు ఉన్నట్టు గుర్తించిన ఎన్నికల సంఘం.. వారికి ఉచిత రవాణా సదుపాయాన్ని కల్పించడంతోపాటు ప్రతి పోలింగ్ కేంద్రంలో కనీసం ఒకటి చొప్పున మొత్తంగా 21,686 వీల్‌చైర్లను అందుబాటులో ఉంచింది. ఓటుహక్కు వినియోగించుకునే దివ్యాంగులకు సాయం చేసేందుకు వలంటీర్లను ఏర్పాటు చేస్తున్నది. వీరికి ప్రత్యేక రంగు టీషర్ట్‌లు అందిస్తున్నారు. వినికిడిలోపం ఉన్న ఓటర్లతో సంభాషించేందుకు వీలుగా పోలింగ్ సిబ్బందికి పిక్టోగ్రామ్ చార్ట్‌లను పంపిణీ చేశారు. కంటి చూపులేని ఓటర్లకు బ్రెయిలీ లిపిలో ముద్రించిన ఓటరు స్లిప్పులను అందించడంతోపాటు 40 వేల డమ్మీ బ్యాలెట్ పేపర్లను బ్రెయిలీలో ప్రింట్ చేశారు. రాష్ట్రంలో 120 పోలింగ్ కేంద్రాలను దివ్యాంగ సిబ్బందితో నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నారు.

పాత ఓటరు కార్డు వారికి కొత్త నంబర్

47 లక్షల ఓటర్లకు ఈసీ లేఖ

హైదరాబాద్, నవంబర్ 27 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో గతంలో జారీ చేసిన ఓటరు కార్డులకు కొత్త నంబర్లను కేటాయిస్తూ ఓటర్లకు ఎన్నికల సంఘం లేఖ రాసింది. రాష్ట్రంలో దశాబ్దం క్రితం వరకు జారీ చేసిన ఓటరు కార్డులు 47 లక్షల వరకు ఉన్నాయని గుర్తించారు. దేశవ్యాప్తంగా ఓటరు కార్డు నంబర్లు ఒకే రీతిలో ఉండేలా మార్పులు చేశారు. రాష్ట్రంలో 14 నంబర్లతో కార్డులు జారీ అయ్యాయి. మొదట AP అనే ఇంగ్లిష్ నంబర్ ఉంటుంది. 12 డిజిటల్ నంబర్లు ఉంటాయి. వీటి స్థానంలో కొత్తగా మొదటి మూడు ఇంగ్లిష్ అక్షరాలు 7 అంకెలతో నంబర్ కేటాయించారు. పాత కార్డు నెంబర్‌తో ఓటు వెతికితే వివరాలు లభ్యం కావు. ఈ నేపథ్యంలో ఓటర్లు గందరగోళానికి గురికాకుండా ఉండాలనే ఉద్దేశంతో ఓటర్లకు ఈసీ లేఖలు రాసింది. ఓటరు పూర్తి వివరాలు పాత కార్డు నంబర్‌తోపాటు కొత్త ఓటరు కార్డు నంబర్‌ను లేఖలో పేర్కొన్నారు.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.